# అంతులేని బాధ

''మన పక్క భాగంలోకి ఎవరయినా కొత్తవాళ్లు వచ్చారా ?'' అడిగాడు సూర్యనారాయణ భార్యను.

''అవును వచ్చినట్టున్నారు. ఇంటావిడ నాలుగురోజులనాడు- ఆ భాగం సున్నం వేయించి, ఇల్లంతా కడిగించింది. తరువాత రెండు లారీలతో సామాను దిగింది. అవన్నీ సర్దుతున్న చప్పుళ్లు వినిపించాయి. ఇద్దరు పిల్లలు వాకిట్లో ఆడుతున్నట్టు కనబడ్డారు. పెద్దవాళ్లను నేను చూడలేదు'' అన్నది భాగ్యలక్ష్మి.

"వీలుచేసుకుని ఎవరోచూడు. కనబడితే మాట్లాడు''.

"కనబడితే మాట్లాడడానికేం ? నాకే తీరిక ఉండదు. లేచినప్పటినుంచీ ఉరుకుపరుగులమీద అన్నీపనులూ కావాలి. స్నానాలు, వంటపనికావాలి. లేవగానే కాఫీలు తయారుకావాలి. నేను కాఫీ చేసినప్పుడు అందరూ లేచి బల్లదగ్గరుంటే తొందరగా ఆ పని అవుతుంది. మీ తమ్ముడుగారూ, పిల్లలు, తొందరగా లేచి ముఖాలు కడగరు. వాళ్ళు లేచినప్పుడు గ్లాసులు పట్టుకొని వెతుక్కుంటూ పోవాలి. మీరు ఆఫీసుకు వెళ్ళింతరువాత నాకు ఎంతటైముంటుందని? పిల్లలిద్దరులేచి కాఫీలు తాగి స్నానం చెయ్యరు. పొద్దునలేచి బాబాయీ అంటూ ఆయనగదిలో చేర్తారు. తొందరగా బైటికిరారు. ఉదయపువేళ చాలాచికాకుగా ఉంటున్నదీమధ్య. ఆఫీసుకు రోజూ ఆలస్యంగా వెళ్తున్నాను రెండునెలలనుంచీ అందరూ నావైపు అదోమాదిరిగా చూస్తారు" అంది. తన దినచర్యకు ఏకరువు పెడుతూ.

అతడు మాట్లాడలేదు.

"సాయంత్రం ఇంటికివచ్చిన తరువాతకూడా క్షణంతీరదు. నీళ్లు ఉండవు. కాళ్లు కడుక్కోటానికయినా. మన స్నానాలు తొందరగా అయితే గంగాళం బకెట్లు నీళ్ళతో నింపిపెట్టుకుని వెళ్ళేదాన్ని. మనవాళ్ళు స్నానాలు తొందరగా

చేస్తేగా ? అయినా నేను వెళ్ళేముందర గంగాళంపెట్టి పంపుతిప్పి వెళ్ళేదాన్ని. ఒక అరగంట వచ్చినా సన్నటిధారపడుతుంటే, పంపు ఆగిపోయేసరికి కొంత యినా నిండేది. ఇప్పుడలా నిండటంలేదు. నీళ్ళే ఉండటంలేదు."

''నీళ్లులేవు. అవి వచ్చినప్పుడే పట్టుకోవాలిమరి ?''

''సరే వచ్చినప్పుడే పట్టుకుంటాము. కాని పక్కనున్నవాళ్ళూ పైన ఉన్న వాళ్లూ 'అందరికీ నీళ్లు కావాలికదా' అని అనుకోకపోతే ఎట్లావస్తాయి ? పంపు పూర్తిగా తిప్పిపెట్టుకుంటారు. బకెట్లునిండి నీళ్లకిందపోతూ ఉంటాయి గాని, వాళ్లు పూర్తిగా పంపుముయ్యరు. ఈ నీళ్లతోనే నాటైమంతా అయిపోతుంటే నాకు ఇరుగు పొరుగులతో మాట్లాడటానికి టైమెక్కడిది ?''

''పోనీలే. నీకు వీలయినప్పుడు ఆమె కనబడితేనే మాట్లాడు. వాళ్ళయింటికి వెళ్ళమనలేదుగా ?''

భాగ్యలక్ష్మి లేచినప్పటినుంచీ నీళ్లు కాగపెట్టటం కాఫీలు చెయ్యటంలో మునిగిపోయింది. బల్లదగ్గరికి ఎవరూ రారు. స్నానంచేసి వంటచేయటం మొదలు పెట్టింది.

తనతోపాటు లేచి ఇంతమాట్లాడిన సూర్యనారాయణ పక్కమీదినుంచి లేచి ముఖం కడక్కుండా తలుపుసందులోనుంచి పడేసిన పేపరు చదువుతూ కూర్చు న్నాడు.

తమ ఆఫీసులో కలిసినప్పుడు జయచెప్పింది—"మేము ఇల్లుమారుతున్నాం" అంటూ వీధినెంబరు ఇంటినెంబరుతోసహా చెప్పింది. ఆ వివరాలను బట్టిచూస్తే అది తమ ఉంటున్న యింట్లో పక్కభాగమే అయిఉండవచ్చుననుకున్నాడు.

తమ ఆఫీసునుంచి బయలుదేరినప్పుడే ఆమె బయలుదేరుతుంది. వెంటనే ఇంటికిరాదు కాబోలుననుకున్నాడు.

''ఆఁ. ఇంకా పేపర్లో అడ్వర్‌టైజ్‌మెంట్లు మిగిలిపోయాయా చదవ టానికి ?'' వంటయింట్లోనుంచి భాగ్యం మాటలు వినిపించి దిగ్గునలేచి, ముఖం కడిగి, బల్లదగ్గరకెళ్ళి కాఫీతాగాడు. స్నానంచేసి బట్టలు వేసుకుని కూర్చున్నాడు. వాకిటిగది కుర్చీలో. ఎదురుగా పెద్ద కిటికీ ఉంది. వచ్చేపొయేవాళ్లు కనబడుతూ ఉంటారు.

అతడు టిఫిన్ తీసుకుని ఆఫీసుకు వెళ్తాడు. ఒంటిగంటకు ప్యూన్ తీసుకు వచ్చిన టిఫిన్ కారియరందుకుని భోజనం చేస్తాడు.

అతడలా చూస్తూ ఉండగానే గేటుదగ్గర లూనా స్టార్టుచేసిన చప్పుడైంది. పక్కయింట్లో ఉన్న ఆమె కాబోలు లూనాఎక్కి ఇద్దరుపిల్లలతో వెళ్ళిపోయింది. ఈమె లూనా కొన్నదా ?

అప్పుడతడికి చురుకుదనంవచ్చి దిగ్గునలేచి "భాగ్యం ! నీపని కాలేదా ? మురళీ స్వాతీ స్నానాలు చేశారా ? ఒరే మోహన్ ! పొద్దునలేచి పిల్లలతో కబుర్లేమిట్రా ! వాళ్ళ స్కూళ్ళకు వెళ్లాలి. భాగ్యం ఆఫీసుకువెళ్ళాలి. నీవుమాత్రం కాలేజికి వెళ్లవా ?'' అంటూ ఇల్లంతా ఒకసారి చుట్టబెట్టి, కాళ్ళకు షూజు లేసుకుంటున్నాడు.

"ఈ యిల్లు ఇంక బాగుపడదు. టైమ్‌సెన్సు ఎవరికిలేదు. ఇంటిసంగతి ఎవరికీ అక్కర్లేదు" అనుకుంటూ పిల్లలకు టిఫిన్‌డబ్బాలు నింపి బల్లమీద పళ్లేలు మంచినీళ్లచెంబు గ్లాసులు పెట్టి వంటయింట్లోనుంచి బయటికి వచ్చింది భాగ్యం.

గడియారం చూసుకుంటే తనకు పావుగంట మాత్రమే ఉంది ఆఫీసుకు వెళ్ళటానికి.

పిల్లలను పిలిచింది. వాళ్ళు బట్టలు వేసుకుని వచ్చి భోజనాలుచేసి డబ్బాలు తీసుకుని స్కూళ్ళకు పరుగెత్తారు.

''మోహన్ ! మేము వెళ్తున్నాము. నీవు వెళ్ళేటప్పుడు ఇంటి తాళపుచేతులు ఎవరికిచ్చి వెళ్తావు ?'' భాగ్యం ఆఫీసుకు వెళ్లటానికి బేగ్ చేతబట్టుకుని అడిగింది.

''నేను పదకొండు గంటలకువెళ్ళి మూడుగంటలకు వస్తాను. మీరంతా వచ్చేసరికి నేను యింట్లోనే ఉంటాను. మీరువెళ్ళండి. నేను స్నానంచేసి భోజనం చేస్తాను" అన్నాడు బద్ధకంగా లేస్తూ.

''స్నానంచేసి పంపుకింద గంగాళంపెట్టు. కొంతయినా నిండుతుంది" ఆమె వెళ్ళిపోయింది.

''మీరుచెప్పిన ఇంటినెంబరు చూస్తే మాయింటిపక్క భాగమేననిపిస్తోంది. అదేనా ?" అడిగాడు. సూర్యనారాయణ తన సీట్లో కూర్చుంటూ జయను.

''అవును. మీనేమ్ ప్లేటు చూశాను''. అంది ముభావంగా. కాని– ఆమె ఎప్పుడూ అంతే ననుకోకూడదు. కలిసినప్పుడైనా సుముఖంగా మాట్లాడదు. అడిగిన ప్రశ్నకు అనాసక్తంగా జవాబిస్తుంది ఒకోసారి. అడగకపోయినా కొట్టి మాట్లాడిస్తుంది మరోసారి. కళాకళలు.

అంతటితో అతడి ఉత్సాహం జారిపోతుంది.

కాని జయ ఆఫీసులో అందరితోటి మాట్లాడుతుంది. జోక్సు చేస్తుంది. కొందరితో తన స్వంత విషయాలుకూడా మాట్లాడుతుంది.

'మరి ఇదేం స్వభావం ? తన ఆఫీసుకు ఆమె బదిలీ అయివచ్చి ఆరునెలలకు పైగా అయింది.'

సమయం దొరికినప్పుడల్లా ఇదే ఆలోచిస్తూ ఉంటాడు సూర్యనారాయణ.

నీళ్లు రోజూ తనకు సరిగా రావటంలేదని ఇంటివాళ్లకు చెప్పింది భాగ్యం.

"చూడమ్మా మా యింట్లో నేనొక్కదాన్ని. నీళ్ళు వచ్చినప్పుడు అందరూ పట్టుకోవాలి. నాచేతిలో ఏముంది ?'' అంటుంది ఇంటి యజమానురాలు.

భాగ్యం ఒకపెద్ద ప్లాస్టిక్ బకెటుకొని వంటయింట్లో తనున్నంతసేపు పట్టి నింపుతున్నది వారంరోజులనుంచీ వారం గడిచిందోలేదో-నీళ్లు సన్నటిధారగా పడటం మొదలయింది.

అవతలి భాగంలో నీళ్ళు పంపుబాగా తిప్పితే తన వంటయింట్లోకి రావు. అవతల బాత్‌రూమ్‌లో బాగా పంపుతిప్పితే తన బాత్‌రూమ్‌లోకి నీళ్ళురావు. అటూ ఇటూ సన్నగా తిప్పితే ఇద్దరికీ నీళ్లొస్తాయి. గాని అందరికీ నీళ్లు కావాలన్న ఆలోచన ఇంట్లోఉన్న అన్నిభాగాలవాళ్లకూ ఉండద్దూ ?

ఇది చిన్న విషయమే చూడటానికి. కాని దానివల్ల కలిగే బాధ పెద్దది.

పెరట్లో తనభాగం శుభ్రంగా ఊడ్చి చెత్తంతా బుట్టలోవేస్తుంది భాగ్యం. పనిమనిషిలేదు. అన్నీ తనే చేసుకుంటుంది. సాయంత్రం తను ఇంటికి వచ్చేసరికి పగలకొట్టిన కోడిగుడ్లు, కూరగాయలచెత్త, ఇల్లు ఊడ్చిన కసువూ అంతా తన గడపముందర ఉంటుంది. ఇదివరకూ ఉన్నవాళ్లు శుభ్రంగా పెరడు ఊడ్చు

కుని తనలాగే చెత్తబుట్టలో వేసుకునేవాళ్ళు. తనభాగంలోఉన్న చెట్లజోలికి వచ్చే వాళ్లు కాదు. తనకిష్టమైన నక్షత్ర చేమంతి తొట్లు విరగబూసేవి. ఆఫీసునుంచి వచ్చి దండలు కట్టి ఫ్రిజ్‌లో పెట్టేది మరునాటికోసం.

ఇప్పుడవీ ఉండటంలేదు. రాత్రిఉన్న మొగ్గలు తెల్లవారేసరికి ఎవరో కొసేస్తున్నారు.

కొత్తగా వచ్చిన ఇంటావిడకు ఇటువంటి పనులన్నీ చెయ్యటానికి టైం ముంటుందా ! ఏమో ? ఇదొక అనుమానం.

ఒకనాడు బస్సులో భాగ్యలక్ష్మి ఆఫీసునుంచి ఇంటికి వస్తున్నది. తన పక్కనే మరొకస్త్రీ కూర్చుంది. ఆమెకూడా ఆఫీసునుంచే వస్తున్నట్టుగా ఉంది. బ్యాగులో టిఫిన్‌డబ్బా ఒక వారపత్రిక నాలుగు అరటిపళ్లూ ఉన్నాయి. పక్కనే కూర్చుంది కనుక ''మీరే స్టాపులో దిగుతారు ?'' అడిగింది భాగ్యం.

ఎటోచూస్తున్న ఆమె ఉలిక్కిపడి ''నేను సరిగ్గా తిలక్‌రోడ్డు దగ్గర దిగి పోతాను. మరి- మీరు ?'' ''నేనూ అక్కడే'' అంది భాగ్యం.

"మీయిల్లు అక్కడికి దగ్గరేనా ?

''అవును. పదినెలల క్రిందట మారాము. ఆయిల్లు స్నోవైట్‌గా ఉంటుంది. పైన రెండుభాగాలు. కింద రెండుభాగాలు. ఔట్‌హౌస్‌లో ఇంటి ఆవిడ. ఇల్లు బాగుంది. చిన్నదయినా అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. ఏది చెడిపోయినా వెంటనే బాగుచేయిస్తుంది. ఆమెకు టెలిఫోనుంది. ఆమె ఔట్‌హౌస్‌కూడా చాలాబాగుంది. శుభ్రంగా పెట్టుకుంటుంది. ఆమె రిటైరయిన హేడ్‌మిస్ట్రెస్‌ట".

''ఆఁ హాఁ. అన్నివిధాలా బాగుందన్నమాట.''

"అవును. చాలా సుఖంగా ఉంది. ఇంటావిడ ఇల్లు ఖాళీ చెయ్యమన్నా చెయ్యం'' అంది.

తిలక్‌రోడ్డు దగ్గర బస్సు ఆగింది. ఆమె దిగి తనయింటికి నడిచి వెళ్ళి పోయింది. భాగ్యం కూరలుకొని, అక్కడున్నషాపులో పిల్లలకు భర్తకూ మేజోళ్లు కొని యింటికి వెళ్ళింది.

ఇలా ఒకటి రెండుసార్లు బస్సులో కలిసిన తరువాత మాటలుకూడా బాగా కలిశాయి.

ఆమె కొంచెం ఎక్కువగా మాట్లాడే స్వభావం కలది. సమయమూ సందర్భమూ లేకుండా ఇంటిసంగతులు ఏకరువు పెడుతుంది.

ఒకసారి అడిగింది- ''మీకు పెళ్ళయి ఎన్నేళ్ళయింది? అని.

బస్సులో పెళ్ళి సంగతులేమిటని ''పదేళ్ళు కావచ్చింది'' అన్నది.

"నాకు ఏడేళ్ళయింది పెళ్ళయి. ఎన్ని సంబంధాలు చూశారో మానాన్న? ఒకటి కుదిరితే ఒకటి కుదరక ఏళ్ళు గడిచాయి." అన్నది పెదవులు సాగదీసుకుంటూ.

"ఎందుకని? అందం తక్కువా? చదువు తక్కువా!

"కాలమండీ-కాలం! కాలమహిమ ఉంటే-దాన్ని మనం అధిగమించగలమా?" అంది పెదవి విరుస్తూ.

ఆయింటికి కింద ఒక మీటరూ పైన ఒక మీటరూ ఉన్నాయి. మైన్ స్విచ్ ఆఫ్‌చేస్తే అన్ని భాగాలకు దీపాలు పోతాయి. రెండు నెలలనుంచీ సాయంత్రపు వేళ టి.వి.లో మంచి సీరియల్ వస్తుండగా దీపాలు ఆరిపోయేవి. మళ్లి ఏ అరగంటకో వచ్చేవి.

ఉదయం ఎనిమిది గంటలకు కరెంటు ఉండేదికాదు. గ్రైండర్లు నడవటానికి వీలులేకుండా ఉండేది. ఇబ్బంది కలిగేది గృహిణులకు.

ఒకనాడు న్యూస్‌పేపరు ఇంకా రాలేదంటూ సూర్యనారాయణ ఇల్లంతా తిరుగుతున్నాడు.

"పోనీ దగ్గరేగా? ఇంకోటి కొనుక్కోకూడదూ అలా తిరక్కపోతే" అన్నది భాగ్యం.

"నాకు కాఫీ తాగుతూ పేపరుచదివే అలవాటు. బజారుకెళ్ళి కొని చదవటానికి టైంలేదు. అయిన నేను చందా అడ్వాన్సుగా ఇస్తున్నాను. రోజూ వేళకు పేపరు వెయ్యవచ్చుగా! నాలుగు రోజులకొకసారి ఇట్లా ఎందుకు చెయ్యాలి? ఆ పేపరువాడు?

ఆనాడంతా అతడికి ఆఫీసులోనూ ఇంట్లోనూ చాలా చికాకనిపించింది. అందరి మీదా కోపంవస్తోంది. కారణం చెప్పలేకపోతున్నాడు. వాస్తవానికి అతడికే తెలియటంలేదు.

ఇంటికి వచ్చిన భాగ్యం ఆనాడు పెరట్లోకివచ్చిచూస్తే తను ఎంతో ఇష్టంతో తెప్పించుకొని ప్రాణప్రదంగా పెంచుకుంటున్న నక్షత్ర చేమంతి తొట్లు రెండూ పగిలి కిందపడిఉన్నాయి. మరొక మూలన పెట్టిన తొట్లలో మరువం పీకేసినట్టుంది.

భాగ్యానికి కళ్ళనీళ్లు వచ్చాయి. పిల్లలతో సమానంగా పెంచుకుంటున్న తన చెట్లను ఇలా ఎవరు చేశారు? తనకెంతో ఇష్టమని ఆ తొట్లను సూర్యనారాయణే కొనుక్కొచ్చాడు. అతడికి కూడా ఆ పగిలిన తొట్లను చూసి బాధ కలిగింది.

"ఎవరు చేశారీపని? దొంగలొస్తే తొట్లు పగలగొట్టి పోతారా? పెరట్లో అన్ని బట్టలుండగా అవి తీసుకుపోతారు గాని!" అన్నాడు గట్టిగానే.

"నేను రేపు వచ్చేటప్పుడు మళ్ళీకొనుక్కొస్తాలే. ఇది ఎవరిదో చిలిపిపని. పెరట్లో చెత్తపొయ్యటం, తొట్లు పగలగొట్టడం, దీపాలు ఆర్పటం, నీళ్ళు రాకుండా చేయటం-ఈ పనులన్నీ పిల్లలు చేశారంటావా? మన పెరట్లోకి ఎవరు వచ్చి తీరిగ్గా కూర్చుని పగలగొట్టిపోతారు?" అన్నాడు భాగ్యాన్ని శాంతపరుస్తూ.

భాగ్యానికి దుఃఖంతో గొంతు పూడుకుపోయింది. ఆనాడు ఎవరితోను, సంతోషంగా మాట్లాడలేకపోయింది. పిల్లలను ప్రేమతో పలకరించలేకపోయింది. వాళ్ళు ముఖాలు చిన్నబుచ్చుకున్నారు.

ఒక రాత్రివేళ భాగ్యంలేచి పిల్లల దగ్గరకెళ్ళి పడుకుని, ఆ తొట్లు పగిలిపోయాయని మీ యిద్దరితో సరిగా మాట్లాడలేదు. అన్నం కలిపిపెట్టలేదు. పడుకునేటప్పుడు కథలూ కబుర్లూ చెప్పలేదు! అని కౌగిలించుకుని ముద్దులు పెట్టుకుంటూ కన్నీరు కార్చింది.

కాని-ఆమె మనసు గుంజుతూనే ఉంది తొట్లవైపుకూ

ఇది చూసి మనసులో బాధపడ్డాడు సూర్యనారాయణ. ఆడవాళ్లకు పువ్వు

లంటే ఎంత ప్రీతి? అందులో భర్తచేత తెప్పించుకున్న తొట్లు. చిన్న విష యాలకే పొంగిపోతారు. అతి స్వల్పమైన విషయాలకే క్రుంగిపోతారు.

అతడు కూడా శోకదేవతలా ముఖంపెట్టిన భాగ్యాన్ని తలెత్తి చూడలేక పోతున్నాడు.

ఆ మరునాడే సూర్యనారాయణ నర్సరీ గార్డెన్ అంతా వెతికి మరో రెండు తొట్లు కొనుక్కొచ్చాడు. భాగ్యం తన గదిలో కిటికీలోనుంచి ఎండపడే చోట పెట్టి జాగ్రత్తగా నీళ్లుపోస్తున్నది ఈ తొట్లు మొగ్గ తొడుగుతుంటే ఆమె పాత వాటిని మర్చిపోసాగింది.

మళ్ళీ ఎప్పటి మాదిరిగా ఇంటి వాతావరణం నవ్వుల పువ్వులను ఏరు కోవటం మొదలుపెట్టింది.

ఎప్పుడో ఒకనాడు తప్ప-భాగ్యం బస్సులో ఆమెకు తరుచుగా కలుస్తునే ఉంది. జయ-అప్రస్తుత ప్రసంగాలతో విసుగు తెప్పిస్తునే ఉంది. మరి ఆమె లూనా ఏమయింది?

"మావారు ఇవాళ ఊరికెళ్ళారు. ఇంకోవారానికి గాని రానన్నారు. ఈ పిల్లలను ఎవరు చూస్తారు? నన్ను వేధించి చంపుతారు. భోజనాలు చెయ్యరు. వేళకు నిద్రపోరు" అన్నది ఒకనాడు జయ.

"అసలు ఈ పెళ్ళి అనేది 'ఎందుకు పెట్టారా' అనిపిస్తూంది. అవి లేక పోతే హాయిగా స్త్రీ పురుషులు స్వేచ్ఛగా సుఖంగా జీవితాలను గడపటం నేర్చు కుని ఆనందంగా ఉండేవారేమోననిపిస్తుంది నాకు. ఎప్పుడూ నేను వాగటమేనా? మీరొక్కమాటయినా మాట్లాడరు" తీవిగా బస్సులో కూర్చుని అన్నది జయ.

"నాకు అటువంటి విషయాల మీద మాట్లాడటం చేతకాదండి. ఆ విశాల దృకథం గాని ఆలోచనలు గాని లేవు. పరిమితమైన జ్ఞానం కూడా లేదంటే నమ్మండి. మీ వంటివారి ముందర నోరు విప్పటమంటే భయంకూడాను" జవాబు చెప్పటానికి ఇష్టంలేని భాగ్యం ఎటో చూస్తూ అన్నది.

"అందుకేనేమో మీవారు అట్లా నిరుత్సాహంగా ఉంటారు. ఇటువంటి వాళ్లను నేను చాలామందిని చూశాను. పెళ్ళికాకముందు స్వేచ్ఛగా ఆనందంగా జీవితాలను గడుపుతారు. పెళ్ళి అయిన తరువాత ప్రపంచమంటే ఏమిటో

తెలియనట్టుగా ఉంటారు. మీవారు కూడా ఆ జాతిలోని వారే ననుకుంటాను" ఆమె మాట్లాడే ప్రతిమాట భాగ్యాన్ని రెచ్చగొట్టే విధానంలో ఉంది. రెచ్చగొట్టితే భాగ్యం ఎలా రియాక్టు అవుతుందో చూడాలన్న కుతూహలాన్ని అణచుకోలేక పోతున్నది. ఆమెకదొక పైశాచికానందం. ఆమెలో అది "ఎప్పుడు పైకిలేచి చిందులు తొక్కుదామా' అని ఎదురుచూస్తూ ఉంటుంది.

భాగ్యం మంచుముక్కలా ఘనీభవించి ఉంది. "నాకు మగవాళ్ళ సంగతులు బాగా తెలియవు. పెళ్ళికాకముందు ఆయనెట్లా ఉండేవారో నాకేం తెలుస్తుంది? ఎప్పుడైనా ఆయన చెబితే వింటాను. మా మధ్య అనుమానాలు అవమానాలు లేవు" అంది భాగ్యం అతిమెల్లగా.

బస్సాగగానే ఇద్దరూ దిగారు. భాగ్యం కూరలూ బిస్కట్లూ కొనుక్కుని ఇల్లు చేరింది.

సామాన్యంగా భాగ్యం ఇంట్లో అందరూ మెల్లగా మాట్లాడుకుంటారు. వాళ్ళమాటలు పక్కగదిలోకే సరిగా వినబడవు. జయ తన మాటల ప్రభావం భాగ్యం యింటి వాతావరణంలో ఎంతవరకూ పనిచేసిందోనని వాకిటి కిటికీ దగ్గర చాటుగా నిలబడి చూసింది.

పిల్లలూ పెద్దలూ ఒకటే నవ్వులు-మధ్య మధ్య భాగ్యం పాటలూ పిల్లల నర్సరీ రైమ్సూ-కోలాహలంగా ఉంది ఇల్లు.

భాగ్యానికి ఈ డోసు చాలనట్టుందని లోపలికివెళ్ళి కుర్చీలో కూర్చుని కాలి మీద కాలువేసుకుని మరో పథకం ఆలోచించటం మొదలుపెట్టింది జయ.

పది సంవత్సరాల క్రిందట సూర్యనారాయణ చూసిన పెళ్ళి సంబంధా లలో జయ సంబంధమొకటి. సూర్యనారాయణ తల్లిదండ్రులు ఆ సంబంధాన్ని మెచ్చలేదు. తరువాత ఎన్నో సంబంధాలు చూసి భాగ్యలక్ష్మిని ఎన్నికచేసుకుని సూర్యనారాయణకిచ్చి పెళ్ళిచేశారు.

జయకు చాలా సంబంధాలు చూశారు. జయ కొద్దిగా పొట్టి, కురచ వెంట్రుకలు లావుపెదవులు, కొట్టినట్లు మాట్లాడటం మొదలైన లక్షణాలు చూసి వచ్చిన సంబంధాలు తిరిగిపోయాయి. మూడు నాలుగేళ్ళు వేచిచూసి, సామాన్య మైన రెండవపెళ్ళి సంబంధం చూసి తల్లిదండ్రులు ఆమెకు పెళ్ళిచేశారు. దాని

ఫలితమే జయ ప్రవర్తన. అసంతృప్తికరమైన జీవితం గడుపుతూ, తననుచూసిన పెళ్ళికొడుకులు ఎక్కడైనా కనబడితే వాళ్ళమీద అసూయ ద్వేషాలు పెంచుకుంటుంది. వాళ్ళను ఏదోవిధంగా బాధించాలనీ భార్యా భర్తల మధ్య విభేదాలు కల్పించి కాపరాలు చెడగొట్టాలనీ ప్రయత్నించి పిచ్చిదానిలా ప్రవర్తిస్తుంది.

ఇలా ఎందరో అయ్యారు.

తనను ఇంకేం చేస్తుందోనని సూర్యనారాయణ అనుమానిస్తూ ఉండగా పది పేజీల ప్రేమలేఖ నలిగిన కాగితాల మీద సూర్యనారాయణ ఎవరికో రాసినది తనదగ్గరున్నట్టుగా కవరులో పెట్టి భాగ్యలక్ష్మి పేరున పోస్టుచేసింది.

'లోకల్ పోస్టే కదా ఇవాళ-లేక రేపు చేరుతుంది భాగ్యానికి' ప్రతిరోజూ ఎదురుచూస్తూ దాని ప్రభావం భాగ్యం పైన ఎట్లా ఉంటుందోననీ, తను తప్పకుండా చూడగలుగుతాననీ ఆశిస్తున్నది జయ.

కాని-ఉత్తరం సూర్యనారాయణ చేతిలో పడ్డది. చదువుకొని చించి బుట్టలో పడేశాడు.

మరునాడు ఆఫీసులో జయ సూర్యనారాయణను చాలా మర్యాదగా పలకరించి ''కాంటిన్‌కు వెళ్లి కాఫీ తాగుదాముర మ్మ''ని ఆహ్వానించింది. అప్పటికే అతడు ఐదారు మందిని వెంటతీసుకుని కాంటీనుకు బయలు దేరుతూ "మీరు కూడా రండి'' అని పిలిచాడు.

"ఇవాళ వద్దులెండి. రేపు మనమిద్దరమూ వెళ్దాం'' అంటూ తనసీటు దగ్గరికి వెళ్ళిపోయింది ఆ ఉద్రేకం తగ్గటానికి గంటపైగా పట్టింది ఆమెకు.

"భాగ్యలక్ష్మిగారూ. మీరు యింట్లో నుంచి బయటికి రాదేమిటండీ. ఒకసారి సినెమాకు వెళ్దామనిఉంది మీతో'' అంది వారంరోజులు గడిచిన తరువాత.

''నేను ఆయనతో తప్ప ఎవరితోనూ ఇంతవరకూ సినెమాకు వెళ్లలేదండీ. అదిగాక వచ్చేసరికి పిల్లలు నిద్రపోతూఉంటారు. వాళ్లను ఎత్తుకుని రావలసివస్తుంది'' అన్నది భాగ్యం.

హతాశురాలయింది జయ.

"ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ఈ భాగ్యం ఒక బండరాయిలా ఉందే.

మిటి? ఈమెలో కదలికను తీసుకురావటమెట్లా?'' ఈ ఆలోచనలతో సతమతమయిపోయే జయకు ఆఫీసులో ప్యూన్ దగ్గర్నుంచి ఆఫీసరువరకూ 'సూర్యనారాయణ మంచితనాన్ని పొగుడుతూ' బదిలీ అయి వెళ్ళిపోతున్నాడు. ఆఫీసును క్రమశిక్షణలో పెట్టి మంచి పద్ధతులను అందరికీ అలవాటుచేశాడు మళ్ళీ మొదటికి వస్తుంది కాబోలు ఈ ఆఫీసు" అనుకుంటున్నారు.

తన ప్రయత్నాలన్నీ విఫలమయినందుకు జయకు ఆశాభంగం కలిగి నెల రోజులు సెలవు పెట్టింది. సూర్యనారాయణకు బదులు ఎవరు వస్తారోనని ఎదురు చూస్తున్నది-ఆయింటికీ ఆఫీసుకీ.

ఆ రాత్రికే సామాను సర్దుకుని తెల్లవారుఝామున బస్సులో ఆ ఊరు విడిచి వెళ్ళిపోయాడు సూర్యనారాయణ తన కుటుంబంతో.

తలుచుకున్నప్పుడల్లా జయకు చిరాకేయటమే కాదు-చేతికి చిక్కిన సూర్యనారాయణ చెయ్యిజారిపోయాడన్న అంతులేని బాధ కలిగింది ఒక నాలుగు రోజులపాటు.

ఒకనాడు ఆమె ఆఫీసుకు వెళ్ళగానే సూర్యనారాయణకు బదులుగా మరొక ఆయన వచ్చాడని ప్యూను చెప్పాడు. ''మంచివార్త చెప్పావు" అంటూ లోపలికి వెళ్ళింది.